


## జీఎస్,డబ్ల్యూఎస్ నోడల్ అధికారి నియామకం

పార్వతీపురం, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారిగా సెట్విజ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.రామ్‌గోపాల్‌ను నియమిస్తూ శనివారం కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు నోడల్ అధికారిగా ఉన్న డ్వామా పీడీని నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇదిలా ఉండగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఆడిట్ టీమ్‌లను కూడా నియమించారు. ఆడిట్ శాఖకు చెందిన వారు పీజీఆర్ఎస్ నోడల్ అధికారులుగా ఉంటారని, వారికి సహాయకారులుగా కలెక్టరేట్ కార్యాలయ సిబ్బందిని నియమించినట్లు కలెక్టర్ చెప్పారు.

# అర్హతలున్నా.. ఏం లాభం?



- పథకాలకు నోచుకోలేకపోతున్న అర్హులు
- గత వైసీపీ సర్కారు హయాంలో అనర్హులకు పెద్దపీట
- నాడు ఎంతో మంది లబ్ధిదారులకు మొండిచేయి
- ప్రస్తుతం వారి పరిస్థితి దయనీయం
- రేషన్‌కార్డులు లేక పింఛన్లు, తదితర వాటికి దూరం
- కూటమి ప్రభుత్వం స్పందించాలని విన్నపం

పార్వతీపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి)

● పార్వతీపురానికి చెందిన పార్వతికి ఆధార్‌కార్డు ఉంది. కానీ రేషన్ కార్డు లేదు. రేషన్ కార్డు మంజూరైతేనే గాని పింఛను రాదు. దీంతో ఆమె కొత్త రేషన్‌కార్డు కోసం ఆశగా ఎదురుచూస్తోంది.

● జిల్లా కేంద్రం పార్వతీపురానికి చెందిన ఓ మహిళ కుమారుడు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. దీంతో ఆమె వితంతవు పింఛన్ నిలిపివేశారు. ప్రత్యేకంగా రేషన్‌కార్డు ఉంటేనే పింఛన్ మంజూరవుతుందని సిబ్బంది చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త రేషన్‌కార్డు మంజూరు చేయాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతోంది.

..ఇలా వారిద్దరే కాదు జిల్లాలో ఎంతోమంది రేషన్‌కార్డులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్ని అర్హతలున్నప్పటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారు. ప్రధానంగా సామాజిక పింఛన్లను నోచుకోక నానా అవస్థలు పడుతున్నారు.

### గత వైసీపీ సర్కారు తీరుతో..

పార్టీలకతీతంగా అర్హులందరికీ సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని కూటమి ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉంది. కానీ గత వైసీపీ సర్కారు నిర్వాకంతో జిల్లాలో చాలా మందికి న్యాయం జరగడం లేదు. వాస్తవంగా సామాజిక పింఛను మంజూరు కావాలంటే రేషన్‌కార్డు తప్పనిసరి. అయితే గతంలో అత్యధికంగా వైసీపీ కార్యకర్తలు, నేతల అనుచరులకే రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. దీంతో టీడీపీ కార్యకర్తల కుటుంబాలతో పాటు అర్హులైన ఎంతోమందికి రేషన్‌కార్డులు మంజూరు కాలేదు. గత ఐదేళ్లు.. రేషన్‌కార్డులు ఉన్న టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీ మద్దతుదారుల పింఛన్లకు నోచుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తా మని ప్రకటించినప్పటికీ రేషన్‌కార్డులు లేని వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.


### కొంతమంది పరిస్థితి ఇలా...

● ఉద్యోగస్థులైన ఆడబిడ్డలు వివాహాలైన అనంతరం అత్తవారింటికి వెళ్లిపోయినా వారి పేర్లు మాత్రం ఇప్పటికీ తల్లిదండ్రుల రేషన్ కార్డుల్లోనే కొనసాగుతున్నాయి. దీంతో అన్ని అర్హతలున్నా.. అటువంటి తల్లిదండ్రులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. తమ ఆడబిడ్డల పేర్లు రేషన్ కార్డుల నుంచి తొలగించాలని వారు గత ఐదేళ్లుగా సచివాలయాలు, ఎంపీడీవోల కార్యాల యాల చుట్టూ తిరుగుతున్నా.. ఇప్పటివరకు ఎటువంటి చర్యల్లేవు.

● అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగుల కుటుంబానికి చెందిన తల్లిదండ్రులకు కూడా సామాజిక పింఛన్లు మంజూరు కావడం లేదు. తక్కువ వేతనానికి సదరు ఉద్యోగులు పనిచేస్తున్నప్పటికీ రేషన్‌కార్డులో వారి పేరు కూడా ఉండడంతో ఎంతోమంది వృద్ధులైన తల్లిదండ్రులు, వితంతువులైన తల్లులు పింఛన్లు పొందలేకపోతున్నారు.

### రేషన్‌కార్డులు ఇలా..

పార్వతీపురం డివిజన్‌లో 1,56,418, పాలకొండ డివిజన్‌లో 1,24,833 రేషన్‌కార్డులు ఉన్నాయి. కొత్త రేషన్‌కార్డుల మంజూరు మార్చి నుంచి నిలిచిపోయింది. ప్రస్తుతం ఈ వెబ్‌సైట్ పనిచేయడం లేదు. కొత్తగా పెళ్లయిన వారితో పాటు గత ప్రభుత్వ హయాంలో నష్టపోయిన అర్హులు, ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చి స్థిరపడిన వారికి.. ప్రభుత్వం తక్షణమే రేషన్‌కార్డులు అందించి (మిగతా 8వ పేజీలో...)



## పారమ్మకొండపై కృత్తిక దీపం

సాలూరు రూరల్, నవంబరు 16 ( ఆంధ్రజ్యోతి ): కార్తీక మాసం సందర్భంగా శనివారం రాత్రి పారమ్మకొండపై కృత్తిక దీపం వెలిగించారు. ముందుగా గిరిశిఖరాన కొలువైన ఉన్న పారమ్మతల్లికి రుత్వికుడు వినయశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం కృత్తిక దీపం వెలిగించారు. దీపజ్యోతిని దర్శించుకోవడానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. కాగా మార్గశిర మాసం వచ్చే వరకు ఈ దీపజ్యోతి దర్శనమివ్వనుంది. అరుణాచలంలో మాదిరిగానే కొన్నేళ్లుగా ఇక్కడ దీపం వెలిగిస్తున్నట్లు సాలూరు సనాతన ధర్మపరిషత్ సభ్యులు తెలిపారు.

# అంగన్‌వాడీల ఆందోళన

● సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ ● కలెక్టరేట్ ఎదుట ధర్నా

బెలగాం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అంగన్‌వాడీలు కదంతొక్కారు. తమ సమస్యలు పరిష్కరించాలని.. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని నినదించారు. శనివారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. సమ్మె కాలంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, మినీ వర్కర్లకు వేసవి సెలవులు, గ్రేడ్ 2 సూపర్ వైజ్ పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 300 కుటుంబాలకు ఒక మినీ సెంటర్ ఉండాల్సిగా 1500 కుటుంబాలకు ఒక సెంటర్ ఉందన్నారు. సుప్రీంకోర్టు తీర్పును సైతం అమలు చేయడం లేదని తెలిపారు. అనంతరం జేసీ శోభికకు వినతిపత్రం అందజేశారు. అంగన్ వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ నాయకులు జ్యోతి, సరళ, అలివేలు, సీఐటీయూ నాయకులు మన్మథ రావు, ఇందిరా, గౌరమ్మ, హిమప్రభ ఉన్నారు.



# రా.. నాన్నా!
## ఇంటికి వెళ్లిపోదాం

● విగతజీవిగా పడి ఉన్న తండ్రి వద్ద కుమారుడి రోదన
● కన్నీరు పెట్టించిన ఘటన
● గోడ కూలి భవన నిర్మాణ కార్మికుడి మృతి
● శోక సంద్రంలో కుటుంబ సభ్యులు

సాలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రోజులానే పనిలోకి వెళ్లిన ఆ కుటుంబ పెద్ద తిరిగి ఇంటికొస్తాడని అనుకున్నారు. కానీ విధి చిన్నచూపు చూసింది. పనిచేసిన చోటే ఆ ఇంటి పెద్ద దిక్కు ఊపిరి ఆగిపోయింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేక పోయారు. విగతజీవిగా పడి ఉన్న తండ్రిని చూసి కుమారుడు షాక్‌కు గురయ్యాడు. ' రా నాన్నా ఇంటికి వెళ్లిపోదాం... మా నాన్నను బయటకు తీసి లేపండి...నాతో ఇంటికి పంపించండి' అంటూ ఆ కుర్రాడు ఏడుస్తున్న తీరు .. అక్కడున్న వారందర్నీ కలిచివేసింది. ఈ విషాదకర ఘటన శనివారం సాలూరులో చోటుచేసుకుంది. సీఐ అప్పలనాయుడు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన నల్లా శంకరరావు(45) బంగారమ్మ పేటలో నివాసిస్తున్నాడు. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన భార్య మరియమ్మ కూడా కూలి పనులు చేస్తూ భర్తకు చేదోడువాదోడుగా ఉంటూ.. కుమారులు ప్రసాద్, సందీప్‌లను చదివిస్తున్నారు. ఆరు నెలలు కిందట శంకరరావు తల్లి చిన్నామ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో వారంతా అదే ప్రాంతంలోని వేరే ఇంట్లో ఉంటున్నారు. కాగా రోజు లానే శంకరరావు శనివారం పట్టణంలోనే పనికి వెళ్లాడు. ఓ పాత ఇంటి గోడను కూల్చుతుండగా.. ఒక్కసారిగా అది ఆయనపై కూలింది. దీంతో శంకరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలిసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో భార్య మరియమ్మ స్పృహ కోల్పోయింది. ఇరుగుపొరుగు వారు వచ్చి సపర్యాలు చేయడంతో కోలుకుంది. మరోవైపు విగతజీవిగా పడి ఉన్న తండ్రిని చూసి పెద్ద కొడుకు ప్రసాద్ బోరున విలపించాడు. వెక్కి వెక్కి ఏడుస్తున్న తీరు చూసి స్థానికులు కూడా కంటనీరు పెట్టుకున్నారు. ప్రసాద్‌ను ఓదార్చడం ఎవరి వల్లా కాలేదు. కాగా మృతదేహాన్ని పంచనామా నిమిత్తం సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తండ్రిని తనతో పంపాలని ఏడుస్తున్న కుమారుడు ప్రసాద్



కూలిన గోడ వద్ద శంకరరావు మృతదేహం



శంకరరావు (ఫైల్)



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీ

## పూర్తిస్థాయిలో తాగునీటి
# సరఫరాయే లక్ష్యం

● మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ రవీంద్ర

పార్వతీపురం టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరాయే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ వి.రవీంద్ర తెలిపారు. శనివారం పార్వతీపురం మున్సిపాల్టీలో తాగునీరు, పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ విభాగాల అధికారులతో సమీక్షిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వేసవిలో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించేందుకు ప్రత్యేక కార్యచరణ సిద్ధం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఏషీయన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్టుమెంట్ బ్యాంకు (ఏఐఐబీ) ద్వారా జిల్లా కేంద్రవాసులకు 2025లోగా పూర్తిస్థాయిలో తాగు నీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నిస్తుందన్నారు. మున్సిపాల్టీలో రహదారుల మరమ్మతులకు రూ.11 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.1.14 కోట్లు, తాగునీటి సరఫరాకు ముందస్తుగా రూ.90 లక్షలు మంజూరుకు ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. ఇంటి పన్నుల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల అనుమతులు లేకుండా బహుళ అంతస్థుల నిర్మాణాలు చేపడితే సంబంధిత యజమానులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటికి కటకట

●చెరువులో గుంతలు తవ్వి.. ఊటనీరు మళ్లించి.. ● పంటను రక్షించుకునేందుకు రైతుల పాట్లు

భామిని, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరుణుడు ముఖం చాటేయడంతో సాగునీటి కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. చివరి దశకు చేరుకున్న వరి పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. కొద్ది రోజులుగా వర్షాలు కురవకపోవడంతో భామిని మండలం వడ్డంగి గ్రామంలో గజపతిసాగరం, ఊర, కనపలకర్ర చెరువులు పూర్తిగా అడుగంటాయి. అయితే వాటి పరిధిలో 300 ఎకరాల్లో వరి పంటకు ఒకటి రెండు తడులు అవసరం. లేకుంటే ఆశించిన స్థాయిలో దిగుబడులు రాని పరిస్థితి. ఈ నేపథ్యంలో రైతులు చెరువు గర్భంలో గోతులు తవ్వి ఊటనీటిని ఇంజన్ సాయంతో పొలాలకు మళ్లిస్తున్నారు. కాగా కొన్నిచోట్ల ఆశించిన విధంగా ఊటనీరు రావడం లేదు. రెండు, మూడు రోజుల తర్వాత గోతుల్లో ఊరుతున్న నీటిని పైపుల ద్వారా పొలాలకు మళ్లించి పంటలకు తడి అందిస్తున్నారు. మండలంలోని లోహరజోల, నులకజోడు, బురుజోల, బొడ్డగూడ తదితర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



చెరువు గర్భంలో ఊటనీటిని ఇంజిన్ సాయంతో పంట పొలాలకు మళ్లిస్తున్న దృశ్యం

# రైతుల కోసం 'కృషి'!

● శాస్త్ర, సాంకేతిక సలహాలతో ముందుకు
● వివిధ రూపాల్లో సేవలందిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం

6లో

## సొంత గూటికి
# చేరేదెపుడో?

● గ్రంథాలయాలకు భవనాలు కరువు
● అద్దె గదుల్లో నిర్వహణ ● పాఠకులకు తప్పని అవస్థలు

6లో

# అధ్యక్షా..!

● 'మన్యం'లో సమస్యలు పరిష్కరించండి
● అసెంబ్లీలో గళమెత్తిన జిల్లా ఎమ్మెల్యేలు

పార్వతీపురం, నవంబరు16 (ఆంధ్రజ్యోతి)/ గుమ్మలక్ష్మీపురం/ పాలకొండ : జిల్లా సమస్యలపై అసెంబ్లీలో ఎమ్మెల్యేలు గళమెత్తారు. నిధులు కేటాయించి.. పరిష్కారం మార్గం చూపించాలని కోరారు. శనివారం శాసన సభలో **పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర** మాట్లాడుతూ... జిల్లాకేంద్రం అభివృద్ధికి దూరంగా ఉంది.. నూతన జిల్లాపై ప్రభుత్వం ప్రత్యేకంగా శ్రద్ధ చూపించాల్సిన అవసరం ఉంది. పట్టణం మీదుగా విశాఖ నుంచి రాయపూర్ వెళ్లే భారీ వాహనాల కారణంగా ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజూ ఎంతోమంది ప్రమాదాలకు గురవుతున్నారు ఈ ప్రమాదాల నివారణకు బైపాస్ రహదారి నిర్మాణం ఎంతో అవసరం. అదే విధంగా జంఝావతి ప్రాజెక్టు పూర్తి చేస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. వేలాది ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుంది. తోటపల్లి ప్రాజెక్టు విస్తరణ కూడా చేపట్టాలి.' అని ఆయన కోరారు.



### జీవోను పునరుద్ధరించాలి

గిరిజన ప్రాంతాల్లో పక్కా ఇళ్ల నిర్మాణానికి 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన జీవోను పునరుద్ధరించాలని **కురుపాం ఎమ్మెల్యే, విప్ తోయక జగదీశ్వరి** శాసనసభలో కోరారు. 'గతంలో కొండ శిఖర గ్రామాల గిరిజనుల కోసం రేకు ఇళ్లు మంజూ రు చేశారు. హుద్ హుద్, తితలీ తుఫాన్ల కారణంగా అవి శిథిలా వస్థకు చేరుకున్నాయి. 2018 లో పీవీటీ జీలకు కేటాయించినట్లుగానే మిగతా వారికి పక్కా గృహాలు మంజూరు చేయాలి.' అని ఆమె విజ్ఞప్తి చేశారు.



### ఆధునికీకరణ పనులు పూర్తి చేయండి

'పాలకొండ, వీరఘట్టం, శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలాలకు సాగునీరు అందించే తోటపల్లి ఎడమ ప్రధాన కాలువ ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలి. గత టీడీపీ ప్రభుత్వం 2018-19లో రూ.195.34 కోట్లు మంజూరు చేసింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటి పనులను నిలిపివేసింది. పాలకొండ నియోజకవర్గ రైతులక ఎంతగానో ఉపయోగపడే ఈ కాలువ ఆధునికీరణకు ప్రస్తుత ధరలకు అనుగుణంగా నిధులు మంజూరు చేయాలి.' అని **పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ** అసెంబ్లీలో కోరారు.



# సొంత గూటికి చేరేదెపుడో?

● గ్రంథాలయాలకు భవనాలు కరువు
● అద్దె గదుల్లో నిర్వహణ ● పాఠకులకు తప్పని అవస్థలు

పాఠకులకు.. ముఖ్యంగా ఉద్యోగార్థులకు ఎంతో ఉపయోగంగా ఉంటున్న గ్రంథాయాల పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతోంది. అధికశాతం గ్రంథాలయాలకు సొంత భవనాలు లేవు. అద్దె భవనాల్లో... ఇరుకిరుకు గదుల్లో నడుస్తున్నాయి. ఏటా గ్రంథాలయ వారోత్సవాల సమయంలో సొంత భవనాల విషయమై చర్చించే అధికారులు.. ప్రజాప్రతినిధులు ఆ తరువాత మరచిపోతున్నారు.



అద్దెభవనంలో నడుస్తున్న శృంగవరపు కోట శాఖా గ్రంథాలయం



గ్రంథాలయంలో చదువుతున్న యువతీ, యువకులు

## సొంతగూడు లేదాయే!

బొబ్బిలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలో 1960లో ప్రభుత్వ గ్రంథాలయాన్ని స్థాపించారు. నాటి నుంచి ప్రైవేటు భవనాల్లో నే నెట్టుకొస్తున్నారు తప్ప సొంత భవనం సమకూర్చుదామన్న ధ్యాస అధికారులు, ప్రజాప్రతినిధుల్లో కానరావడం లేదు. జెండా వీధి జంక్షన్‌లో జవహర్ మున్సిపల్ స్కూలును ఎత్తివేసిన తరువాత ఆ భవనంలోని కొంత భాగాన్ని కొన్నాళ్ల పాటు గ్రంథాలయం నడుపుకునేందుకు ఇచ్చారు. పూర్తి శిథిలావస్థకు చేరుకోవడంతో మరమ్మతుల పేరుతో అక్కడి నుంచి గ్రంథాలయాన్ని మున్సిపాలిటీ వారు ఖాళీ చేయించారు. రెండేళ్లు కావస్తున్నా ఆ భవనానికి అతీగతీ లేదు. గత ఎన్నికల ముందు జనసేన నాయకుడు పాలూరు బాబు గ్రంథాలయం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. అప్పట్లో వారంలోగా మరమ్మతులు పూర్తి చేసి అప్పగిస్తామన్నారు. ఇప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. ఎంతోమంది నిరుద్యోగులు ఈ గ్రంథాలయంలో పుస్తకాలు చదువుకొని... గ్రూప్-2, ఎస్‌ఐ, కానిస్టేబుల్ వంటి ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం 25 మంది రోజూ ఇక్కడికి అల్పాహారం తెచ్చుకొని ప్రశాంతంగా చదువుకోగలుగుతున్నారు.



పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

## రామమందిరంలో గ్రంథాలయం..

బొబ్బిలి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండలం చింతాడ గ్రామంలో 2007లో గ్రామస్తులంతా కలిసి చందాలు వేసుకొని గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలో గల శ్రీరామ మందిరం పైన ఉన్న గదిలో దీన్ని నడుపుతున్నారు. సుమారు 900 పుస్తకాలను సమకూర్చారు. గ్రామానికి చెందిన యువతి మరడాన అపర్ణ లైబ్రేరియన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సత్యనారాయణ సహాయకునిగా వ్యవహరిస్తున్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి గ్రంథాలయం ఎంతో ఉపయుక్తంగా ఉందని యువకులు చెబుతున్నారు. చింతాడ గ్రంథాలయాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి సొంత భవనం, కంప్యూటర్లు, ఫర్నీచరు, పుస్తకాల వంటివి సమకూర్చాలని స్థానికులు కోరుతున్నారు. బొబ్బిలి ప్రాంతానికి చెందిన రిటైర్డ్ పీఏసీఎస్ ఉద్యోగి దత్తి అప్పలనాయుడు విశాఖలో ఉంటున్నారు. బొబ్బిలి, బాడంగి, తెర్లాం, బలిజిపేట ప్రాంతాలలో గ్రామ యువకులు నడుపుకునే గ్రంథాలయాన్నిటికీ సొంత ఖర్చుతో ఆయన పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు.



చింతాడ గ్రంథాలయంలో చదువుకుంటున్న దృశ్యం





రామమందిరంపైన చింతాడ గ్రంథాలయం

## 18 వేల పుస్తకాలు ఉన్నాయి..



బొబ్బిలి గ్రంథాలయంలో 18 వేల పుస్తకాలు ఉన్నాయి. రోజుకు 60 మంది చదువుకునేందుకు వస్తున్నారు. పనిదినాలు, వేళలతో సంబంధం లేకుండా ఉదయం 6 నుంచి రాత్రి 9 వరకు నిరుద్యోగులు చదువుకునేందుకు సహకరిస్తున్నాం. వసతి మాత్రమే సక్రమంగా లేదు. ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. భవనానికి మరమ్మతులు చేసి అప్పగిస్తామన్నారు. శాశ్వతంగా మంచి భవనం సమకూర్చితే పాఠకుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది.+

-స్వర్ణకుమారి, లైబ్రేరియన్, బొబ్బిలి

## శిథిలస్థితిలో...

కొత్తవలస, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసలో నున్న శాఖాగ్రంథాలయానికి సుమారు 75 సంవత్సరాల చరిత్ర ఉంది. 1950 నుంచే ఇక్కడ గ్రంథాలయం ఉంది. దీనిలో ప్రస్తుతం వివిధ రకాలైన 14 వేల పుస్తకాలు ఉన్నాయని ఇన్‌చార్జి లైబ్రేరియన్ రామలక్ష్మి తెలిపారు. సరైన భవనం లేక ఎన్నో విలువైన పుస్తకాలు తడిసి పాడైపోయాయి. గతంలో దాతలు ఉచితంగా ఇచ్చిన భవనాల్లోల నడిపేవారు. పదేళ్ల కిందట పాత ఎంపీడీఓ కార్యాలయ భవనంలోకి మార్పు చేశారు. ప్రస్తుతం ఈ భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. కొత్తవలస- కె.కోటపాడు మార్గంలో జంక్షన్‌కు దూరంగా ఉండడంతో ఇక్కడ గ్రంథాలయం ఉందనే విషయమే చాలామందికి తెలియదు. పోటీ పరీక్షలకు హాజరయ్యే వారు దీన్ని వినియోగించుకుంటున్నారు.

## అద్దెభవనం నుంచి బయట పడేదెప్పుడో!

శృంగవరపుకోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రూప్స్, ఆర్ఆర్‌బీ, కానిస్టేబుల్, డీఎస్సీ. ఇలా అన్ని ఉద్యోగాలకు పోటీ పడేందుకు అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులో వున్నాయి. దీంతో చుట్టు పక్కల గ్రామాలకు చెందిన నిరుద్యోగులతో గ్రంథాలయం నిత్యం సందడిగా ఉంటుంది. నిరుద్యోగులకు ఆశాదీపంలా ఉన్న ఈ శాఖా గ్రంథాలయం అద్దెభవనంలో నడుస్తోంది. 1954 ఏప్రిల్ 13న ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో రూ.993 విలువ కలగిన 640 పుస్తకాలను అందుబాటులో ఉంచారు. అప్పటి నుంచీ అద్దె భవనంలోనే నడిచింది. పాఠకుల ఆందోళనలు, డిమాండ్లతో పోలీస్ స్టేషన్ సమీపంలో 8 సెంట్ల స్థలాన్ని దీనికోసం కేటాయించారు. 2001లో సొంత భవనాన్ని నిర్మించారు. ఇది శిథిలావస్థకు చేరుకుంది. దీంతో గ్రంథాలయ శాఖాధికారి దామేదర శ్రీధర్ దీన్ని మళ్లీ అద్దెభవనంలోకి మార్చారు. ప్రస్తుతం ఇక్కడ 26,741 వివిధ రకాల పుస్తకాలు ఉన్నాయి.

### దాతల సాయం అడుగుతున్నాం..

గ్రంథాలయానికి సొంత భవనాన్ని నిర్మించేందుకు దాతల సాయం కోరుతున్నాం. శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి, ఆరు నెలల క్రితం వరకు ఎమ్మెల్సీగా ఉన్న ఇందుకూరి రఘురాజు దృష్టిలో పెట్టాను. ప్రభుత్వ నిధులు, దాతల సాయంతో నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

-దామోదర శ్రీధర్, శాఖా గ్రంథాలయ అధికారి, శృంగవరపుకోట

### సొంత భవనం నిర్మించాలి..



అద్దె భవనంలో గ్రంథాలయం నడుస్తోంది. దీన్ని కూడా ఖాళీ చేయమని చెబుతున్నారు. సొంత భవనం నిర్మాణానికి నాయకులు, అధికారులు చొరవచూపాలి.

-మేడిశెట్టి జయరాం

### పోటీ పరీక్షల పుస్తకాలు ఉన్నాయి..



పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలన్నీ ఇక్కడ ఉన్నాయి. దాతల సహయంతో తాగునీరు, కుర్చీలు సమకూర్చారు. గ్రంథాలయ సమయం ముగిసిన తరువాత కూడ ఇక్కడ ఉండేందుకు అవకాశం కల్పిస్తున్నారు. నిరుద్యోగులకు బాగా ఉపయోగపడుతోంది.

-చల్లా నరేష్

# 'భవిత' అస్తవ్యస్తం

● కేంద్రాలను గాలికొదిలేసిన జగన్ సర్కారు ● ఐదేళ్లుగా నిర్లక్ష్యంగా విడిచిపెట్టిన వైనం
● ఎన్నికలకు ముందు సమీప పాఠశాలలో విలీనం ● దెబ్బతిన్న లక్ష్యం

విజయనగరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి)

జిల్లాలో భవిత కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. నిర్వహణను గత ప్రభుత్వం గాలికివదిలేసింది. కనీస స్థాయిలో అభివృద్ధి చేయలేదు. మానసిక వైకల్యంతో బాధపడుతున్న చిన్నారుల భవితను తీర్చిదిద్దే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేయగా వైసీపీ ప్రభుత్వం వాటి వైపే చూడలేదు. రవాణా చార్జీలు, సహాయకులకు ఇవ్వాల్సిన సాయం విడుదల చేయలేదు. దీనికి తోడు కేంద్రాలను సమీప పాఠశాలల్లో విలీనం చేశారు. ఆ తర్వాత పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. జిల్లా అధికారులు గ్రామాల వారీగా సర్వే నిర్వహించి పిల్లలను గుర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అటు కేంద్రాల్లో సైతం సరైన వసతులు లేవు.

### సగం మందే హాజరు..

భవిత కేంద్రాల్లో ప్రత్యేకావసరాలున్న పిల్లలకు వైద్యసేవలందించాలి. ఫిజియోథెరపీ చేయిస్తే వారి మానసిక స్థితితో పాటు శారీరక వైకల్యాన్ని కొంతవరకూ అధిగమించవచ్చు. అక్కడ శిక్షణ తీసుకునే ఉపాధ్యాయులు, ఫిజియోథెరపీ వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. జిల్లా వ్యాప్తంగా 27 భవిత కేంద్రాలను ఏర్పాటుచేశారు. వాటిలో 4000 మంది చిన్నారులు నమోదుచేసుకున్నారు. కానీ సగం మంది కూడా రాని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు గ్రామాల వారీగా ప్రత్యేకావసరాలున్న పిల్లల సర్వే జరుగుతోంది. వారిని గుర్తించే పనిలో అధికారులున్నారు.

### రవాణా చార్జీలు నిలిపివేత..

సాధారణంగా భవిత కేంద్రాలు మండల కేంద్రాల్లో ఉంటాయి. ఇక్కడకు చేరుకోవడం చాలా కష్టం. అందుకే ప్రభుత్వం భవిత కేంద్రాలకు వచ్చే చిన్నారుల రవాణా ఖర్చుల కోసం రూ.300 అందించేది. వెంట వచ్చే సహాయకులకు సైతం రూ.300 అందించేది. బాలికల విద్యను ప్రోత్స హించేందుకుగాను ప్రత్యేకంగా రవాణా ఖర్చులకు అదనంగా రూ.300 చెల్లించేది. అయితే గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం చెల్లింపులను నిలిపివేసింది. ఈ ఏడాది ఎన్నికలకు ముందు అరకొర నిధులను విడుదల చేసింది. ముఖ్యంగా పేద, సామాన్యులు తమ పిల్లలను మండల కేంద్రాలకు తరచూ తీసుకురావడం చాలా కష్టం. దీనికి తోడు గత ఏడాది వైసీపీ ప్రభుత్వం ఒక జీవోను జారీచేసింది. ఆ ప్రకారం భవిత కేంద్రాలను సమీప పాఠశాలల్లో విలీనం చేశారు. దీంతో ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయి. ఫిజియోథెరపీతో పాటు వారి ప్రత్యేక శిక్షణకు సైతం ఇబ్బందులు తలెత్తాయి.



### సదరం సర్టిఫికెట్లు లేక..

మానసిక వైకల్యంతో బాధపడే చిన్నారులకు ప్రభుత్వం పది నెలలకు రూ.4000 పింఛన్ మొత్తంగా అందిస్తూ వస్తోంది. మరికొందరికి వారి మానసిక ఇబ్బందులు బట్టి వైద్యులు ఇచ్చే సదరం సర్టిఫికెట్ బట్టి పింఛన్ ఇస్తారు. ముందుగా పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే నాలుగైదు మండలాలకు చెందిన వారికి ఒకేసారి పరీక్షిస్తారు. ఈ ప్రక్రియకు దాదాపు 3 నెలలు పడుతోంది. సర్టిఫికెట్ జారీకి మరో నెల రోజులు అవసరమవుతోంది. వారు ఇచ్చే తేదీల్లో ప్రత్యేకావసరాలున్న చిన్నారులు వెళ్లలేకపోతున్నారు. సదరం సర్టిఫికెట్లు లేక పింఛన్‌తో పాటు ఇతరత్రా రాయితీలకు దూర మవుతున్నారు. కేంద్రంలో నమోదైన వారికి సైతం సదరం సర్టిఫికెట్లు ఉండాల్సిందేనని అధికారులు చెబు తుండడంతో తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రత్యేకావసరాలున్న చిన్నారుల్లో 30 శాతం మందికి సదరం పత్రాలు లేవని తెలుస్తోంది.

### పరికరాలు, యంత్రాల ఊసులేదు..

భవిత కేంద్రాలను వైసీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. ఇక్కడ పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులర్ చేస్తామని జగన్ అంతకుముందు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హామీ ఇచ్చారు. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేశారే తప్ప రెగ్యులర్ చేయలేదు. దీనికితోడు భవిత కేంద్రాలను సమీప పాఠశాలల్లో విలీనం చేశారు. ఐదేళ్లుగా భవిత కేంద్రాల్లో కొత్తవాటిని మంజూరు చేయలేదు. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం అన్నిరకాల పరికరాలు, యంత్రాలు, ఆట బొమ్మలను సైతం అందించింది. ప్రధానంగా ప్రతి కేంద్రానికి వీల్ సైకిళ్లు, ట్రెడ్‌మిల్స్ ట్రెడ్స్ అందించింది. చాలా కేంద్రాల్లో ఇవి పాడయ్యాయి. వాటి స్థానంలో కొత్త వాటిని జగన్ సర్కారు అందించలేదు. ఐదేళ్ల పాటు కాలయాపన చేసి చివరకు కేంద్రాలను సమీప పాఠశాలల్లో విలీనం చేసి చేతులు దులుపుకున్నారు. చివరకు ఫిజియోథెరపీ సేవలకు సంబంధించిన బెడ్‌లు సైతం పాడయ్యాయి. దీంతో బెంచీలపై పడుకోబెట్టి సేవలందించాల్సి వస్తోంది.

# వామ్మో.. ఆ ఆసుపత్రా!

● కనీస సౌకర్యాల్లేవు.. పారిశుధ్యం అధ్వానం
● సమయపాలన పాటించని కొందరు వైద్యులు
● రాత్రి వేళల్లో రోగులు వస్తే రెఫర్ చేయడమే







వార్డులో రోగులు గదిలో పేరుకుపోయిన మందుల వ్యర్థాలు, బెడ్‌షీట్ లేని మంచంపై శిలైన్ బాటిల్

మెంటాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మెంటాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే రోగులు బెంబేలెత్తి పోతున్నారు. పేరుకే రౌండ్ ద క్లాక్ (24 గంటలు ఆసుపత్రి) సేవలు. అందేది మాత్రం నాలుగు గంటలే. ఆస్పత్రిలో వాష్ రూములు అధ్వానంగా ఉన్నాయి. నీటి సౌకర్యం అంతంత మాత్రమే. ఇక ఆసుపత్రిలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. డస్ట్ బిన్లలో వ్యర్థాలు నిండిపోయినా అలాగే వదిలేస్తున్నారు. రోగుల బెడ్ల పక్కనే వ్యర్థాలు నిండిఉన్న డస్ట్‌బిన్‌లు కనిపిస్తున్నాయి. బెడ్లపై దుప్పట్లు ఉండవు. బెడ్‌షీట్లు నాసిరకంగా ఉండడంతో వాటిని వినియోగించడంలేదు. పరుపులు చిరిగిపోవడంతో ఆ సందుల్లోకి దోమలు, నల్లులు పోతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ పోతే అంతే సంగతులు. కొంతమంది వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలనపైనా విమర్శలు లేకపోలేదు. సాయంత్రం అయితే స్టాఫ్ నర్సు లేదా ఏఎన్ఎం మాత్రమే ఆసుపత్రికి దిక్కు. వచ్చిన రోగులను గజపతినగరం, విజయనగరం రిఫర్ చేస్తుంటారు. ఆలస్యంగా రావడం ముందే వెళ్లిపోవడం ఇక్కడ కొందరు సిబ్బందికి అలవాటుగా మారిందని చెబుతారు. రాత్రివేళల్లో కాల్ డ్యూటీ వైద్యులు కూడా అందుబాటులో ఉండడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో రాత్రి పూట గజపతినగరం లేదా విజయనగరం వెళ్లాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. ఈ ఆసుపత్రి పరిధిలో గిరిజన గ్రామాలు ఎక్కువగా ఉన్నాయి. అనంతగిరి మండలంలోని రాబ, రొంపల్లి, గరుగుబిల్లి ప్రాంత గిరిజనులు ఇక్కడికే వైద్యం కోసం వస్తుంటారు. పాముకాటు, విష పురుగు కాటులు తరుచూ సంభవిస్తుంటాయి. వైద్యులు, సిబ్బంది సరిగా అందుబాటులో లేకపోవడం వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యాధికారిణి లోకప్రియను వివరణ కోరగా వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారన్నారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు బయట వేస్తున్నారన్నారు. మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగానే ఉందన్నారు.





# రైతుల కోసం కృషి

● శాస్త్ర, సాంకేతిక సలహాలతో ముందుకు
● వివిధ రూపాల్లో సేవలందిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం



వర్మీ కంపోస్టుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కురుపాం రూరల్: కురుపాం మండలం రస్తాకుంటుబాయి గ్రామంలో 1984లో ఏర్పాటు చేసిన కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఇది నడుస్తోంది. 70 ఎకరాల విస్తీర్ణంలో కేవీకేను ఏర్పాటు చేశారు. రైతులకు అవుసరమైన నమూనా ప్రదర్శన క్షేత్రాలను దీనిలో నిర్వహిస్తున్నారు. అక్కడ వ్యవసాయ పనిముట్లతో కూడిన మ్యూజియంను ఏర్పాటు చేశారు. భూసార పరీక్షా కేంద్రం, విలువ ఆధారిత ఉత్పత్తుల కేంద్రం, హెరిటేజ్ భవనం, ఆవులు, కోళ్ల కోసం నిర్మించిన షెడ్లు, గ్రీన్ షేడ్ నెట్లు, చేపల చెరువులు, ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల మొక్కలు, చిరుధాన్యాల ప్రదర్శనా క్షేత్రాలు అక్కడ మనకు కనిపిస్తాయి.

### అనుబంధ వృత్తులకు...

వ్యవసాయ అనుబంధ వృత్తులైన మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకం, పుట్టగొడుగుల సాగు, తేనెటీగల పెంపకం, జనపనార, అరటి నారతో గృహాలంకరణ వస్తువుల తయారీ, చిరుధాన్యాలతో బిస్కెట్లు, కేకులు, బన్‌ల తయారీ, జీడిపండ్లతో పచ్చళ్లు, శీతల పానీయాల తయారీ వంటి అంశాలను ప్రోత్సహిస్తున్నారు. ప్రధానంగా జీడిలో వచ్చే తేయాకు దోమ తెగులు నివారణకు అవసరమైన యాజమాన్య పద్ధతులపై కొన్ని సంవత్సరాలుగా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. పెరటి తోటల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నారు. అధిక ఆదాయాన్నిచ్చే బంతిపూల సాగును ప్రోత్సహిస్తున్నారు. రైతులను కేరళ తీసుకువెళ్లి జీడి పండ్లతో తయారు చేసే వస్తువులపై శిక్షణ ఇప్పించారు. అధిక ఫలసాయాలను ఇచ్చే జీడి మొక్కలను లక్షల సంఖ్యలో రైతులకు సరఫరా చేశారు. చిన అంటిజోల, పెదమేరంగి, రాముడుగూడ, చిలకాం, చలివేంద్రి, తుంబలి, కారాడవలస గ్రామాలను కేవీకే తరఫున దత్తత తీసుకున్నారు. అక్కడి రైతులకు సాంకేతిక సాయాన్ని అందిస్తూ వ్యవసాయంలో నూతన పద్ధతులు నేర్చుకునే విధంగా కృషి చేస్తున్నారు. అగ్రికల్చరల్ బీఎస్సీ, వ్యవసాయ పాలిటెక్నిక్ చదివే విద్యార్థులు క్షేత్ర స్థాయిలో అనుభవం కోసం ఏటా ఇక్కడికి వస్తున్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు కేవీకేకి పూర్తి స్థాయి శాస్త్రజ్ఞులను నియమించారు. డాక్టర్ ఎస్.ధృవ ప్రోగ్రాం కోఆర్డినేటరుగా వ్యవహరిస్తున్నారు.

### అదనపు ఆదాయానికి కృషి..

రైతులకు అదనపు ఆదాయం సమకూర్చడమే కేవీకే లక్ష్యం. మన్యం జిల్లాలో లక్క ఉత్పత్తి జరుగుతోంది. లక్కను గుర్తించడం.. సేకరించడం.... ప్రాసెస్.. మార్కెట్ చేయడంలో రైతులకు పెద్దగా అవగాహన లేదు. ఈ అంశంపై దృష్టి సారించి శిక్షణ ఇచ్చే ప్రతిపాదన ఉంది.

-డాక్టర్. ఎస్.ధృవ, కేవీకే హెడ్

### మెరుగైన సేవలు..

కేవీకే తరఫున రైతులకు మెరుగైన సేవలు అందుతున్నాయి. శాస్త్రవేత్తలు మా సందేహాలను నివృత్తి చేస్తూ, నూతన పద్ధతులను వివరిస్తున్నారు. మాకు మంచి మేలు చేస్తున్నారు.

-పువ్వల పత్తి, ఆదర్శ రైతు, దురిబిలి

### వివిధ శాఖల సమన్వయం..

వివిధ శాఖలను, స్వచ్ఛంద సంస్థలను సమన్వయం చేసుకుంటూ కేవీకే కార్యక్రమాలు అమలు చేస్తోంది. స్వచ్ఛంద సంస్థల తరఫున మేము కూడా గ్రామాల్లో నూతన సాంకేతిక పద్ధతులుపై అవగాహన కల్పిస్తున్నాం.

-షేక్ గౌస్ సాహెబ్, కురుపాం



షేడ్ నెట్‌లో పూలసాగు

# ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యం




ర్యాలీలో పాల్గొన్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

విజయనగరం దాసన్నపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాటమే ఎర్రదండు లక్ష్యమని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అన్నారు. సీపీఎం పదో జిల్లా మహాసభల సందర్భంగా నగరంలో భారీ ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. ఎన్‌సీఎస్ జంక్షన్ నుంచి కన్యకాపరమేశ్వరీ ఆలయం, గంటస్తంభం, మూడులాంతర్లు మీదుగా కోట జంక్షన్‌లోని బొంకులదిబ్బకి చేరుకుంది. సీపీఎం జిల్లా పార్టీ కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మోదీ రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారని... కానీ అప్రంటీస్ చేయిస్తామని కంపెనీలకు రూ.లక్ష కోట్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ అమెరికా వెళ్లి... కంపెనీలు తెస్తామని చెబుతున్నారన్నారు. 2016లో కూడా ఇదే మాట చెప్పారన్నారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోకనాథం మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ అమ్ముతుంటే ప్రభుత్వం ఎందుకు అడ్డుపడడం లేదని ప్రశ్నించారు. గిరిజన ప్రాంతాల్లో డోలీ మోతలు తప్పడం లేదన్నారు. ఆడపిల్లలపై అత్యాచారాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డి శంకరరావు, టీవీ రమణ, జగన్మోహన్, రమణ, సురేష్, రామ్మోహన్, రమణమ్మ పాల్గొన్నారు.

## న్యూస్ బాక్స్

### రేపటి నుంచి 'మీకోసం'

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ రద్దయినందున కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం ఈనెల 18న యథావిధిగా కొనసాగుతుందని డీఆర్‌వో శ్రీనివాసమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

### ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

రామభద్రపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో ధాన్యం కొనుగోలుకు 4 కేంద్రాలను ఏర్పాటు చేశామని తహసీల్దార్ ఆకుల సులోచనారాణి తెలిపారు. బూసాయవలసలో 2, కొట్టక్కిలో 1, ఆరికతోటలో 1 కేంద్రంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు.

### వీధి దీపాలను సరిచేయాలి

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 16: (ఆంధ్రజ్యోతి): మరమ్మతులకు గురైన వీధి దీపాలను తక్షణమే సరిచేసి వినియోగంలోకి తీసుకురావాలని నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఇంజనీరింగు సిబ్బందికి ఆదేశించారు. శనివారం పాత ఐడీఎస్‌ఎండీ కాంప్లెక్స్ పై అంతస్థులో పాడైన వీధి దీపాలను ఆయన పరిశీలించారు. వీధి దీపాలకు తక్షణమే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు.

### అపార్ నమోదు వేగవంతం

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన అపార్ ఐడీ నమోదు ప్రక్రియ శతశాతం జరిగే విధంగా చూడాలని సిబ్బందికి నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య శనివారం తెలిపారు. ఐడీ నమోదు ప్రక్రియ వేగవంతంగా పూర్తిచేసేలా ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళుతోందన్నారు.

### 19న టాయిలెట్ డే

బాడంగి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ టాయిలెట్ డే కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వీవోఏలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

### బీజేపీ సమావేశం

శృంగవరపుకోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పట్టణంలో శనివారం బీజేపీ సమావేశం నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల ఏజెంట్లపై చర్చించారు. విశాఖ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి శ్రీరంగ దానేష్, నాయకులు దాశెట్టి దాశరథి, కొట్యాడ ఆరమ కోటి. డి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

### సమయపాలన మాసోత్సవాలు

శృంగవరపుకోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ఆర్టీసీ డిపోలో శనివారం సమయపాలన మాసోత్సవాలు నిర్వహించారు. డిసెంబరు 15 వరకు ఈ మాసోత్సవాలు ఉంటాయని డిపో మేనేజర్ రమేష్ తెలిపారు.

### సమస్యలపై వినతి

బొబ్బిలి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ 104 సిబ్బంది కారాడ సర్పంచ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం మండల కార్యదర్శి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

### ప్లాస్టిక్ విక్రయాలపై కొరడా

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలపై నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. నగరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం రోడ్డులోని హోల్‌సేల్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ప్లాస్టిక్ వస్తువులు స్వాధీనం చేసుకోవడంతో పాటు, అపరాధ రుసుం విధించారు. సుమారు 560 కేజీల నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టరు కొండపల్లి సాంబమూర్తి బాలకృష్ణ, రవిశేఖర్, రామకృష్ణ, పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అవసరమైనర మౌలిక సదుపాయాలను తక్షణమే కల్పించాలని ఇంజనీరింగ్ అధికారులకు నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఆదేశించారు. శనివారం కేఎల్‌పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆసుపత్రికి కావల్సిన సదుపాయాలను వెంటనే కల్పించాలని ఆదేశించారు.

### గ్రీన్ క్యాంపస్‌గా మార్చేందుకు కృషి

విజయనగరం రూరల్, నవంబరు 16: జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయాన్ని గ్రీన్ క్యాంపస్‌గా మార్చేందుకు విద్యార్థులు, అధ్యాపకులు ముందుకు రావాలని ఇన్‌చార్జి వీసీ డి.రాజ్యలక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయాన్ని గ్రీన్‌క్యాంపస్‌గా మార్చుతూ ప్రారంభించారు.

### 10 వేల టీడీపీ సభ్యత్వాలు

గంట్యాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వాలు 10వేలు పూర్తి చేయడంతో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కె.భాస్కర్ నాయుడును మంత్రి శ్రీనివాస్ అభినందించారు. గంట్యాడలో 10,008, దత్తిరాజేరులో 5,839, గజపతినగరంలో 2,512, బొండపల్లిలో 4,007, జామిలో 2,352 సభ్యత్వాలు నమోదయ్యాయి.

## క్రైం కార్నర్

### తల్లికి తలకొరివి పెట్టిన కుమార్తె



తల్లికి అంతిమ సంస్కారాలు చేస్తున్న నూకరత్నం

కొత్తవలస, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓ కుమార్తె తన తల్లికి తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది. స్థానికుల కథనం మేరకు తుమ్మికాపల్లి పంచాయతీ వినాయక నగర్‌లో ఉంటున్న రాజులమ్మ అనే వృద్ధురాలికి భర్త ఉన్నా ఎటూ కదలేని పరిస్థితి. ఆమెకు నూకరత్నం అనే కుమార్తె ఉంది. రాజులమ్మ టిఫిన్ సెంటర్ పెట్టుకుని భర్తను పోషించుకుంటోంది. కొద్దినెలలుగా ఆమె ఆరోగ్యం దెబ్బతినడంతో స్థానికంగా ఉన్న ఫర్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్టు ద్వారా బియ్యం, నిత్యావసరాలను అందిస్తున్నారు. శుక్రవారం ఆమె ఆరోగ్యం మరింత క్షీణించడంతో విశాఖ కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడే బ్రెయిన్ స్ట్రోక్‌తో శనివారం తెల్లవారు జామున మృతి చెందింది. అక్కడి నుంచి రాజులమ్మ భౌతిక కాయాన్ని వినాయక నగర్ తీసుకొచ్చారు. తల్లి మృతి విషయం తెలుసుకున్న నూకరత్నం వచ్చి తలకొరివి పెట్టి..అంతిమ సంస్కారాలు పూర్తి చేసింది.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లక్కవరపుకోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భీమాలి గ్రామానికి చెందిన గుల్లిపల్లి సంతోష్ (37) పురుగు మందు తాగి విజయనగరం మహరాజా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందినట్లు ఎస్ఐ నవీన్‌పడాల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు సంతోష్ దివ్యాంగుడు. విశాఖలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో పని చేస్తున్నాడు. రెండేళ్ల కిందట వివాహమైంది. పూర్తి దివ్యాంగుడైనందున కుటుంబానికి భారం కాకూడదని ఈ నెల 13న గడ్డి మందు తాగినట్టు కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు. చికిత్స కోసం విజయనగరం తీసుకెళ్లినట్టు భార్య సంతోషి తెలిపిందని ఎస్ఐ పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

## శివారు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ: ఎస్పీ

విజయనగరం క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రద్దీ ప్రాంతాలు, శివారు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా వేయనున్నట్టు ఎస్పీ వకుల్ జిందాల్ ఓ ప్రకటనలో తెలిపారు. చైన్ స్నాచింగ్స్, ఈవ్‌టీచింగ్, రహదారి ప్రమాదాలు, దొంగతనాలు, కోడి పందేలు, పేకాటలు నిర్వహించేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నట్టు తెలిపారు. తోటలు, బహిరంగ ప్రదేశాలు, పార్కులు, నదీతీరాలను ముందుగా గుర్తించి డ్రోన్స్ పంపించి నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్య కూడళ్లల్లో ట్రాఫిక్ నియంత్రణ, మహిళలపై దాడులు నియంత్రించేందుకు సుదూర ప్రాంతంలో ఉన్న వ్యక్తులపై నిఘా పెట్టేందుకు డ్రోన్స్ వినియోగిస్తామన్నారు. నగరంలోని జేఎన్‌టీయూ, కలెక్టరేట్, కేఎల్ పురం, మయూరి కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్ రైల్వే స్టేషన్, తోటపాలెం, అంబేడ్కర్ జంక్షన్ వంటి ప్రాంతాలు, కళాశాలల వద్ద నిఘా ఏర్పాటు చేశామన్నారు. బొబ్బిలి పట్టణంలో ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉన్న బ్లాక్ స్పాట్స్‌పై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. వాణిజ్య సముదాయాలు, ప్రధాన రహదారులపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

## సర్పంచులను గుర్తించని సదస్సులు ఎందుకు?



మాట్లాడుతున్న వివిధ పంచాయతీల సర్పంచులు

జామి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న అధికారులు తమకు విలువ ఇవ్వడం లేదని... ఇటువంటి సందర్భంలో శిక్షణ సదస్సులు ఎందుకని సర్పంచులు అధికారులను నిలదీశారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో సర్పంచులు సుబ్రహ్మణ్యం, సూర్యారావు, లక్ష్మి తదితరులు మాట్లాడుతూ ఇప్పటికే ఉపాధి పథకం పనులు పంచాయతీ ప్రణాళికలోవి కాకుండా వారికి నచ్చినట్టు చేయిస్తున్నారని ఆరోపించారు. పశువుల షెడ్ల కేటాయింపు వంటివి తమకు తెలియకుండానే జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రతి విషయంలోనూ సర్పంచ్‌లను చులకనగా చూస్తున్నారని వాపోయారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ సర్పంచ్‌లను గౌరవించాలని చెప్పినా..క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదన్నారు జడ్పీటీసీ సరయు మాట్లాడుతూ అధికారులు ఏం చెబుతారో విని అప్పుడు మీ ఆవేదన తెలియజేయండని చెప్పడంతో శాంతించారు. ఈ సదస్సులో కాసేపు గందరగోళం నెలకొంది. ఆ తరువాత యథావిధిగా కొనసాగింది.

## జనసేనలోకి వైసీపీ నాయకులు



జనసేనలో చేరిన వారితో అవనాపు విక్రమ్

విజయనగరం దాసన్నపేట, నవంబరు 16: (ఆంధ్రజ్యోతి): నగరంలోని 50వ డివిజన్‌లో వైసీపీకి చెందిన ముఖ్య నాయకులు శనివారం జనసేన నాయకులు అవనాపు విక్రమ్ సమక్షంలో పార్టీలో చేరారు. వీరిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ పవన్ కల్యాణ్ ఆశయాలు నచ్చి పార్టీలో చేరిన వారందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. తీగల సాయికుమార్, సత్యనారాయణ, బుగత సంతోష్‌కుమార్, మజ్జి శ్రీనివాసరావు, ఎర్రా కామేశ్వరరావులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పట్నాయక్, వెంకటేష్ చౌదరి, మారేష్, పాపారావు, ఖాదర్, నర్సింగరావు పాల్గొన్నారు.

## వినతులను స్వీకరించిన జనసేన నేతలు



వినతులు స్వీకరిస్తున్న జనసేన నాయకులు

శృంగవరపుకోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పట్టణంలో శనివారం జనసేన నేతలు ప్రజా సమస్యల పై వినతులు స్వీకరించారు. నియోజకవర్గ ఇంచార్జి ఒబ్బిన సత్యనారాయణ హాజరయ్యారు. పింఛన్లు, ఇంటి స్థలాల కోసం వినతులు అందినట్లు జనసైనికులు తాండ్రంగి చంటి, మోపాడ చిన్ని, పెనుమత్స సురేష్‌రాజు, జి.సతీష్ తెలిపారు. ఎమ్మెల్యే లలిత కుమారి ద్వారా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళతామని నాయకులు తెలిపారు.

## పూర్తి స్థాయిలో సేవలందించండి



ఉద్యోగులతో చర్చిస్తున్న టాస్క్‌ఫోర్స్ సభ్యులు

బొండపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు గ్రామస్థాయిలో అన్ని సేవలను పక్కాగా అందించాల్సిన బాధ్యత హెల్త్ వెల్‌నెస్ కేంద్రం వైద్య సిబ్బందిపై ఉందని డిప్యూటీ డీఅండ్‌హెచ్‌వో సూర్యనారాయణ సూచించారు. రాచకిండాం హెల్త్‌వెల్‌నెస్ కేంద్రాన్ని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా టాస్క్‌ఫోర్సు టీం అధికారులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రం పరిధిలో ఉన్న బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందిస్తున్న సేవలు, అంగన్‌వాడీ కేంద్రాలు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలతో పాటు రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన విధంగా సేవలను పక్కాగా అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ సత్యవతి, ఎస్‌వో రాంబాబు, డీపీఎం రామానుజులునాయుడు, సూపరవైజర్ ఎస్‌ఏబాషా, హెల్త్ సహాయకులు సత్యారావు, ఎంఎల్‌హెచ్‌పీలు షర్మిల, హారిత పాల్గొన్నారు.

## కంచమ్మతల్లి విగ్రహం ఊరేగింపు



ఘటాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

గంట్యాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సిరిపురం గ్రామంలోని కంచమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. ఆలయం వద్ద సింహాచలం దేవస్థానం అర్చకుల ఆధ్వర్యంలో మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు కంచమ్మ తల్లి నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డీసీసీబీతో పీఏసీఎస్‌ల అనుసంధానం

జామి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్‌లు ఇక నుంచి జిల్లా కేంద్రంలో ఉన్న డీసీసీబీతో అనుసంధానం కాబోతున్నాయని జాయింట్ కలెక్టర్, డీసీసీబీ పర్సన్ ఇంచార్జి సేతుమాధవన్ తెలిపారు. అన్నంరాజుపేట పీఏసీఎస్‌లో జరుగుతున్న కంప్యూటర్ మానిటరైజింగ్ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఇకపై రికార్డులు మొత్తం డిజిటలైజేషన్ కాబోతున్నాయన్నారు. వివరాలన్నీ కంప్యూటరీకరించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో ఉమమహేశ్వరరావు, డీసీవో రమేష్, తహసీల్దార్ కృష్ణలత, ఎస్.కోట బ్రాంచ్ మేనేజర్ సోమశేఖర్ పాల్గొన్నారు.

### అంగన్‌వాడీపై విచారణ

సంతకవిటి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లి గ్రామంలో బుధవారం జరిగిన సంఘటనపై మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ అధికారిణి కనకదుర్గ శనివారం విచారణ చేపట్టారు. బాలుడి పట్ల అంగన్‌వాడీ కార్యకర్త అనుచితంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. తండ్రి రామినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్టు తెలిపారు.

### ఆయన చూపు సజీవం

రాజాం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): లచ్చయ్యపేటకు చెందిన అల్లాడ సుబ్బారావు (50) శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సమాచారం అందుకున్న శ్రీకాకుళంలోని టెక్నీషియన్ సుజాత, ఉమాశంకర్ వచ్చి సత్యారావు వద్ద కార్నియాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ ఛైర్మన్ పి.జగన్మోహన్‌రావు రాజాం రెడ్‌క్రాస్ ఛైర్మన్ సాయి ప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్ పాల్గొన్నారు.

### 19 నుంచి సత్యసాయి జయంత్యుత్సవాలు

రాజాం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి కాలనీ సుందరం ఆలయంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 99వ జయంతోత్సవాలు ఈ నెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్టు కమిటీ కన్వీనరు ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



మాట్లాడుతున్న కూర్మారావు

దత్తిరాజేరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కర్ణాటక సమగ్రశిక్ష అభియాన్ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ మిత్తిరెడ్డి కూర్మారావు కోరారు. దత్తిరాజేరులోని పోరలి గ్రామానికి చెందిన కూర్మారావు ప్రస్తుతం కర్ణాటక సమగ్రశిక్ష అభియాన్ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం తాను చదివిన దత్తిరాజేరు జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదువుకొని మంచి ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. మన రాష్ట్రంలో విద్యపై అమలు చేస్తున్న పథకాలను ఆయన ప్రసంసించారు. ఈ కార్యక్రమంలో డీఈవో వై.మాణిక్యాలరావు, డిప్యూటీ డీఈవో బి.మోహనరావు, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు బి.ప్రసాదరావు, ఆదినారాయణ ఎంఈవోలు వెంకటరావు, సుధాకర్ పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి




కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గంజాయి, మద్యం, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో పోలీసు అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక రాజా కళాశాలలో డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సైబర్ నేరగాళ్లు ఏవిధంగా మోసాలకు పాల్పడుతున్నదీ వివరించారు. ఈ తరహా నేరాలకు సంబంధించిన సమాచారం అందించిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని డీఎస్పీ తెలిపారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీఐ సతీష్‌కుమార్, ప్రిన్సిపాల్ సీహెచ్ వీరేంద్ర కుమార్, అధ్యాపకులు రమేష్, గిరడ ప్రభాకరరావు పాల్గొన్నారు.

### ప్రణాళికల్లో భాగస్వాములు కావాలి

రామభద్రపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల్లో ప్రజలు భాగస్వాములు కావాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై సర్పంచులు, ఎంపీటీసీలు, సెక్రటరీలు, అధికారులకు శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు ఆదర్శంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వెంకటరమణ, టీవోటీలు పార్థసారధి, బంగార్రాజు, శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మజ్జి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### భద్రతా ప్రమాణాలపై తనిఖీ

బొబ్బిలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి గ్రోత్ సెంటరులో గల బెర్రీ, విక్టోరియా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై తహసీల్దారు ఎం.శ్రీను శనివార తనిఖీలు నిర్వహించారు. ప్లాంట్ల లోపల పరిశీలించారు. ఇక్కడి పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతుండడం, కార్మికులు మృతి చెందుతున్న ఘటనలు చోటుచేసుకోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో తహశీల్దారు తనిఖీలు నిర్వహించారు. పరిశ్రమల వారీగా ప్రాజెక్టు రిపోర్టులు, భద్రతా ప్రమాణాలపై నివేదికలను సోమవారం అందజేయాలని ఆదేశించారు. ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమలకు అవసరమైన ఇసుకను ప్రభుత్వ రీచ్‌ల నుంచి మాత్రమే తీసుకెళ్లాలని, అక్రమ మార్గంలో తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

### భక్తిశ్రద్ధలతో పడిపూజ

రాజాం రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాస్త్రాస మాజం విశ్వనాథ గురునిలయంలో శనివారం రాత్రి పడిపూజ (18 మెట్లు) ఘనంగా నిర్వహించారు. శబరిమల అయ్యప్ప దేవాలయాన్ని శనివారం తెరిచిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రాసమాజం పీఠాధిపతి ఉమాపతిశేష గురుస్వామి, అయ్యప్ప దీక్షాధారులు పాలొన్నారు.

# అర్హతలున్నా.. ఏం లాభం?

(ఐదో పేజీ తరువాయి)

సామాజిక పింఛన్లు ఇతర సంక్షేమ పథకాలను అందించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

**ఆదేశాలు రాలేదు..**

కొత్త రేషన్ కార్డుల మంజూరు కోసం ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. ఉత్తర్వులు అందిన వెంటనే నూతన రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ ప్రారంభిస్తాం.

**-శ్రీనివాసరావు, ఇన్‌చార్జి డీఎస్‌వో, పార్వతీపురం మన్యం**

## ఉపాధ్యాయులు, వార్డెన్ల చేతుల్లోనే విద్యార్థుల ఆరోగ్యం

- జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ

జియ్యమ్మవలస, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన బాలల ఆరోగ్యం ఉపాధ్యాయులు, వార్డెన్ల చేతుల్లోనే ఉందని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ అన్నారు. శనివారం టీకే జమ్ము గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. మలేరియా పాజిటివ్ వచ్చిన పిల్లలను ప్రత్యేక సిక్ రూములో ఉంచాలని సూచించారు. అనంతరం దిగువసిరిపిలో మలేరియా బాధితులను పరామర్శించారు. ఫోకల్ స్ప్రేయింగ్ చేయించాలని సిబ్బందికి సూచించారు. జిల్లా కన్సల్టెంట్ రామచంద్రరావు, హెచ్‌ఎం కృష్ణవేణి, వార్డెన్ లక్ష్మి, సబ్ యూనిట్ అధికారి రాధాకృష్ణ, మలేరియా సూపర్‌వైజర్ ఆదినారాయణ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## సక్రమంగా టీకాలు వేయాలి



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఐవో నారాయణ

పార్వతీపురం రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బందులుప్పి పీహెచ్‌సీ పరిధిలో గల అడ్డాపుశీల పంచాయతీ బంటువానివలస గ్రామాన్ని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఎం.నారాయణ శనివారం సందర్శించారు. గ్రామంలోని టీకా కార్యక్రమాన్ని పరిశీలించి కార్డులు తనిఖీ చేశారు. సకాలంలో పిల్లలకు టీకాలు వేస్తున్నారా.. లేదా అని తేదీలను పరిశీలించారు. పిల్లల్లో శ్వాసకోశ సంబంధిత సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఎప్పటికప్పుడు నీటి స్వచ్ఛత పరీక్షలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జయగౌడ్, ఏఎన్‌ఎం శాంతికుమారి, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణిసంధ్య ఉన్నారు.

## కబేళాలకు తరలిస్తున్న పశువుల పట్టివేత

సీతంపేట రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కబేళాలకు అక్రమంగా పశువులను తరలిస్తున్న ముఠా సభ్యులను సీతంపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం స్థానిక ఎస్‌ఐ అమ్మన్నరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా వ్యానులో 18 పశువులను అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. ఒడిశా ప్రాంతంలోని నౌపాడ గ్రామం నుంచి విజయనగరం జిల్లా మానాపురం గ్రామానికి వీటిని తరలిస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు. ఈ మేరకు మహోత్రం అలీ, రిజ్వాన్‌ఖాన్, సఖహోరోజ్ ఖాన్‌లను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

## జీసీసీ సొసైటీ ఎన్నికలకు 9 నామినేషన్లు

సీతంపేట రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సీతంపేట జీసీసీ సొసైటీ ఎన్నికలకు శనివారం 9 నామినేషన్లు దాఖలయ్యాయి. స్థానిక జీసీసీ బ్రాంచ్ కార్యాలయంలో సొసైటీ ఎలక్షన్ ఇన్‌చార్జి జి.విజయకుమార్, డీఎల్‌సీవో వై.మోహనరావు, బీఎం డి.కృష్ణారావుల ఆధ్వర్యంలో నామినేషన్ల ప్రక్రియ చేపట్టారు. సొసైటీ ఎన్నికలకు దాఖలైన నామినేషన్లను 18వ తేదీన పరిశీలిస్తామని చెప్పారు. అలాగే 19న నామినేషన్ల ఉపసంహరణ చేసుకోవచ్చునని తెలిపారు. ఈనెల 25వ తేదీన ఎన్నికలు ఉంటాయని బీఎం కృష్ణారావు చెప్పారు.

## తప్పుడు నివేదికలు ఇవ్వడం సరికాదు

పాలకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ఆధునికీకరణ పనులపై తప్పుడు నివేదికలు ఇవ్వడం సరికాదని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ఆయన శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తోటపల్లి కాలువలపై వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. 2014-19 మధ్యకాలంలో టీడీపీ హయాంలో తోటపల్లి కాలువల ఆధునికీకరణ కేవలం 9 శాతం మాత్రమే జరగగా అప్పటి టీడీపీ ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా బిల్లులు చెల్లించలేదని ఆయన విమర్శించారు. 2019 అధికారంలోకి వైకాపా ప్రభుత్వ హయాంలో 2019-24సంవత్సరాల్లో 14శాతం పనులు పూర్తిచేశామని తెలిపారు.

## మహిళలకు అండగా చట్టాలు

సీతంపేట రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మహిళలకు అండగా ఎన్నో చట్టాలు ఉన్నాయని స్థానిక ఎస్‌ఐ అమ్మన్నరావు అన్నారు. శనివారం స్థానిక ఏపీఆర్ బాలికల గురుకుల కళాశాలలో సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సైబర్ క్రైం, మహిళలకు రక్షణగా నిలిచే చట్టాలను వివరించారు. బాలికలకు ఎటువంటి సహాయం కావాలన్నా పోలీసులను ఆశ్రయించవొచ్చునని సూచించారు. ఫిర్యాదులు, సూచనలు చేయాలనుకునే వారి కోసం కళాశాలలో సంకల్పం బాక్స్ ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

## మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం

జియ్యమ్మవలస, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే అది జీవితాన్నే నాశనం చేస్తుందని చినమేరంగి సీఐ టీవీ తిరుపతిరావు అన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా శనివారం చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వీకేజీ మహారాణా ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలను సీఐ తిరుపతిరావు, ఎస్‌ఐ పి.అనీష్ విద్యార్థులకు వివరించారు. కళాశాల లెక్చరర్లు పాల్గొన్నారు.

## రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలి

సాలూరు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వన్‌ధన్ వికాస కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలని లీగల్ కోఆర్డినేటర్ కె.సత్యనారాయణ అన్నారు. సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల వన్‌ధన్ వికాస కేంద్రాల రికార్డు నిర్వహణపై శనివారం సాలూరులో ఏపీఎం అంపల్లి జయమ్మ ఆధ్వర్యంలో బుక్ కీపర్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నగదు పుస్తకం, కొనుగోలు రిజిస్టర్, అమ్మకాలు రిజిస్టర్ తదితర రికార్డుల రాయడంపై శిక్షణనిచ్చారు. వివిధ అంశాలను వివరించారు.

## సమాజ హితులు పాత్రికేయులు

ఒడిశా

రాయగడ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పాత్రికేయులు సమాజ హితులని సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘమిత్ర దేవి అన్నారు. జాతీయ పాత్రికేయుల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక జడ్పీ సమావేశ హాలులో పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పాత్రికేయుల సంక్షేమానికి శ్రద్ధ తీసుకుంటుందని ఇందులో భాగంగా రూ.2లక్షలు ఉన్న గోపబంధు బీమా పథకాన్ని రూ.5లక్షలకు పెంచినట్లు తెలిపారు. అనంతరం విలేకర్లకు సన్మానం చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కరచంద్ర రౌయిత్, డీఐపీఆర్వో బసంతకుమార్ ప్రధాన్, వివిధ పత్రికా సంస్థల ప్రతినిధులు, విద్యా సంస్థల ఉపాధ్యాయులు, పలు పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

# లీకవుతున్నా పట్టించుకోరా?

- శిథిలావస్థలో కొత్తగూడ రక్షిత నీటి పథకం
- ట్యాంకు నుంచి ధారగా కారుతున్న నీరు
- పట్టించుకోని అధికారులు



ట్యాంకు నుంచి నీరు కారుతున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రక్షిత తాగునీటి పథకం ట్యాంకు నుంచి నీరు లీకై కిందకు ధారగా కారుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పదేళ్ల కిందట నిర్మించిన ఈ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంటున్నా ఎవరికీ పట్టడం లేదు. ఇలా అయితే తాగునీటికి ఇబ్బందులు తప్పవని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదీ గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఇరిడి పంచాయతీ కొత్తగూడ గ్రామంలో ఉన్న రక్షిత మంచినీటి పథకం ట్యాంకు దుస్థితి. గత కొన్ని రోజులుగా ఈ ట్యాంకు లీకై ధారగా నీరు కిందకు కారుతోంది. పదేళ్ల కిందట ఇంటిగ్రేటెడ్ యాక్షన్ ప్లాన్ నిధులతో ఈ ట్యాంకును నిర్మించారు. అయితే ఇప్పటివరకు మరమ్మతులు జరగలేదు. దీంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడం తోపాటు లీకవుతోంది. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి ఈ వాటర్ ట్యాంక్‌కు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని కొత్తగూడ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

**మరమ్మతులు చేపడతాం**

కొత్తగూడ రక్షిత మంచినీటి పథకం లీక్ అవుతున్న విషయం నిజమే. ఈ ట్యాంకు మరమ్మతుల కోసం పై అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు అయిన వెంటనే మరమ్మతులు చేపడతాం.

**- కె.నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, కురుపాం**

# వీఆర్‌పేటను సందర్శించిన కలెక్టర్



గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరాయుడుపేట గ్రామాన్ని కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ శనివారం ఉదయం సందర్శించారు. జట్టు స్వచ్ఛంద సంస్థ వెంకటరాయుడుపేట గ్రామంలో గోశాల ఏర్పాటు చేసి, తద్వారా మోడల్ గ్రామంగా తీర్చి దిద్దడానికి నిర్ణయించింది. ఈ మేరకు కలెక్టర్ సంబంధిత ప్రతినిధులతో కలిసి ఆ గ్రామాన్ని పరిశీలించారు. జిల్లాలో వివిధ మండలాల్లో పెద్ద ఎత్తున డెయిరీ స్థాయిలో నిర్వహణకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని పశు సంవర్థక శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర సలహాదారు సి.శ్రీనివాసన్, మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు అధికారి శ్రీనివాసరావు, పశు వైద్య అధికారి జయకిరణ్, జట్టు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి

జియ్యమ్మవలస, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో శంబంగి రమేష్ కోరారు. శనివారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరం, వెలుగు కార్యాలయాల్లో ఎంపీపీ బొంగు సురేష్ అధ్యక్షతన గ్రామ పంచాయతీ, బ్లాక్ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక 2025-26పై టీవోటీలతో శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు 2025-26కు గాను ప్రణాళికలు ఏ విధంగా తయారు చేయాలనే విషయంపై ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. అభివృద్ధి పనులను గుర్తించి డిసెంబరులోగా అందజేస్తే 2025 ఫిబ్రవరిలోగా నిధులు మంజూరు చేయించుకోవచ్చన్నారు. ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు దృష్టి సారించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం లో జడ్పీటీసీ సభ్యురాలు మూడడ్ల శశికళ, వైస్ ఎంపీపీ గుడివాడ సంపత్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, వీవోఏలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

**మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత**

గరుగుబిల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో పి.పైడితల్లి, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు సూచించారు. శనివారం మండల అభివృద్ధి కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలపై సర్పంచ్‌లు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీలకు అవసరమైన అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో పశు వైద్యాధికారి ఎస్.సురేష్‌కుమార్, ఏవో ఎన్.అర్జునరావు, వెలుగు ఏపీఎం పి.అప్పలనాయుడు, ఉపాధి ఏపీవో ఎం.గౌరీనాథ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

## పెదబొండపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పార్వతీపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద బొండపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించామని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రజ్యోతిలో కొనుగోలు ఏది అనే శీర్షికపై వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లాలో మొత్తం 183 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఒక్కొక్క కేంద్రానికి ముగ్గురు చొప్పున తాత్కాలిక సిబ్బందిని నియమించామని, ధాన్యం కొనుగోలులో శిక్షణ అందించామని తెలిపారు. బ్యాంకు గ్యారెంటీ విషయంలో జిల్లాలో మిల్లర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. రైతులు వారికి నచ్చిన మిల్లులకు ధాన్యం తరలించుకోవచ్చునన్నారు. దళారులను ఆశ్రయించవద్దన్నారు.

## గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సీతంపేట రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లోని ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు అన్నారు. శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో స్వచ్ఛ సుందర పార్వతీపురం మన్యం కార్యక్రమంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రత, పంచాయతీల్లో శానిటేషన్ డ్రైవ్‌లు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ వర్క్‌షాప్‌లో స్వచ్ఛంధ్ర మిషన్ సలహాదారుడు శ్రీనివాసన్, ఈవోపీఆర్డీ కె.సత్యం, సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ అమలుపై హర్షం

బెలగాం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పీఎఫ్ సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు హర్షణీయమని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ అన్నారు. ఈ మేరకు శనివారం విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు టి.రమేష్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘాల బలోపేతానికి చర్యలు

గరుగుబిల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పరపతి సహకార సంఘాల ఆర్థిక బలోపేతానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని పార్వతీపురం సబ్ డివిజన్ సహకార అధికారి పి.జ్యోతి అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో శనివారం 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను పురస్కరించుకుని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఈవో ఎన్.గుంపస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

సీతంపేట రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఐటీడీఏ డిప్యూటీ డీఈవో పి.నారాయుడు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారులు ఆచార్య ఎస్‌ఆర్ రంగనాథన్, శ్రీ అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలను వేసి నివాళులు అర్పించారు. గ్రంథాలయాధికారి బి గణేష్, సహాయకుడు రామకృష్ణ ఉన్నారు.

**పుస్తక పఠనం అలవర్చుకోవాలి**

పార్వతీపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ఎల్.రమేష్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకత శక్తిని వెలికితీయడానికి గ్రంథాయాలు ఎంతో దోహదపడతాయన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు జ్ఞాపికలు, పుస్తకాలు అందించారు. గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు టి.శివకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహన్‌రావు



హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలిస్తున్న జగన్మోహన్‌రావు

కొమరాడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన్‌రావు అన్నారు. కోటిపాం జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులకు నిర్వహిస్తున్న హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలించారు. అనారోగ్యం కారణంగా విద్యార్థులు పాఠశాలకు రాకుండా ఎవరైనా ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అవయవ దాతకు నివాళిగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మక్కువ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాచిపెంట మండలం కొత్తవలస గ్రామానికి చెందిన లంకేన సాయిని స్మరించుకుంటూ మక్కువలో విద్యార్థులు, ఆటో యూనియన్ సభ్యులు శనివారం ర్యాలీ నిర్వహించారు. సాయి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాల పాలై, విజయనగరం చికిత్స పొందుతూ ఈనెల 13న బ్రెయిన్ డెడ్‌కు గురయ్యాడు. దీంతో కుటుంబీకులు ఆస్పత్రివారి సూచన మేరకు సాయి అవయవాలను దానం చేశారు. ఈసందర్భంగా మక్కువలో నిర్వహించిన ర్యాలీలో వైసీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, టీడీపీ నాయకుడు మావుడి ప్రసాదరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జోనల్ పోటీల్లో బొడ్డవలస విద్యార్థుల ప్రతిభ



చాంపియన్ ట్రోఫీ అందుకుంటున్న పీడీ విద్యాసాగర్

సాలూరు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల బీఆర్ అంబేడ్కర్ గురుకులాల జోనల్ పోటీల్లో బొడ్డవలస బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆశీర్వాదం, పీడీ విద్యాసాగర్ శనివారం రాత్రి విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 14 నుంచి విజయనగరం జిల్లా కొప్పెర్ల గురుకులంలో జరిగిన ఉత్తరాంధ్ర జిల్లాల బీఆర్ అంబేడ్కర్ గురుకులాల జోనల్ పోటీల్లో కబడ్డీ జూనియర్స్ విజేతగా తమ పాఠశాల నిలిచిందని తెలిపారు. చదరంగంలో ఎస్.వరుణ్ విజేతగా నిలిచాడని చెప్పారు. గేమ్స్‌లో వ్యక్తిగత విభాగంలో ఆల్‌రౌండ్ చాంపియన్‌గా కె.చరణ్‌తేజ ఎంపికయ్యాడన్నారు. షాట్‌పుట్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రోలో కె.చరణ్‌తేజ స్వర్ణాలు సాధించాడని తెలిపారు. డిస్కస్‌త్రో పి.హర్ష రజత పతకం సాధించాడన్నారు. 200, 1500 మీటర్ల పరుగుపందెంలో పి.హర్ష కాంస్య పతకాలు సాధించాడని, జవెలిన్ త్రోలో డి.ప్రేమ్ కాంస్య పతకం సాధించాడని చెప్పారు. స్పోర్ట్స్ సీనియర్ విభాగంలో షాట్‌పుట్‌లో యశ్వంత్‌కుమార్ కాంస్యపతకం, 800 మీటర్ల పరుగు పందెంలో ఎస్.రంజిత్ కాంస్య పతకం సాధించాడని తెలిపారు. ఈసందర్భంగా బొడ్డవలస బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యార్థులను ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఫ్లోరెన్స్, పాఠశాల పీఈటీ నాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలి



ఏలాం కూడలి వద్ద సాగునీటి కాలువను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్, నీటిపారుదలశాఖ జేఈలు

పాలకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ఎడమ ప్రధాన కాలువ ఆక్రమణలకు పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలని పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఈనెల 13న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన సాగునీరు వృథా శీర్షికకు ఆయన స్పందించారు. ఈ మేరకు శనివారం ఏలాం జంక్షన్‌లోని ఆక్రమణలకు గురైన ఇరిగేషన్ కాలువను, సీఎల్ నాయుడు కాలనీ శివారు ప్రాంతం లో సాగునీరు వృథాగా పోవడాన్ని పరిశీలించారు. కాలువల ఆక్రమణ లతోనే సాగునీరు ప్రధాన రహదారులపై వస్తుందని ఇరిగేషన్ జేఈలు శంకరరావు, కార్తీక్ ఆయన దృష్టికి తీసుకొచ్చారు. పాలకొండ పట్టణం గుండా వడమకు వెళ్తున్న సాగునీటి కాలువ ఆక్రమణలకు గురైన తీరును పరిశీలించి నగర పంచాయతీ, ఆర్అండ్‌బీ, నీటి పారుదల శాఖ అధికారులు సమగ్ర చర్యల చేపట్టాలని ఆయన ఆదేశించారు.

## కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా రామకృష్ణ

సాలూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సాలూరు నియోజకవర్గ సమన్వయకర్తగా గేదెల రామకృష్ణను నియమించినట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు సిగడాపు బంగారయ్య తెలిపారు. శనివారం సాలూరులోని ఓ కల్యాణ మండపంలో పార్టీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణను పార్టీ నాయకుడు ద్వారపురెడ్డి పుండరీకాక్షనాయుడు పరిచయం చేశారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే డీసీసీ అధ్యక్షుడు బుల్లిబాబు, జిల్లా ఇన్‌చార్జి బత్తిన మోహన్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమగ్రాభివృద్ధికి సహకరించాలి

పాలకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీలో పలు సమస్యలు ఉన్నాయి, వాటిని పరిష్కరించి అభివృద్ధికి సహకరించాలని సీపీఎం నాయకుడు దావాల రమణారావు కోరారు. ఈమేరకు నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావును శనివారం వినతిపత్రాన్ని అందించారు. పాలకొండ నగర పంచాయతీలో డంపింగ్ యార్డు శాశ్వత పరిష్కారం చేపట్టాని, పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. జగనన్న కాలనీలో మౌలిక సదుపాయల కల్పనకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ప్రతి ఇంటికి కొళాయిలు ఏర్పాటు చేయాలన్నారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

## ఎల్‌టీఆర్ కేసులపై విచారణ



విచారణ చేపడుతున్న పీవో అశుతోష్ శ్రీవాస్తవ

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎల్‌టీఆర్ కేసులపై పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ శనివారం విచారణ చేశారు. ఎల్విన్‌పేట గిరిజన సంక్షేమ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో గుమ్మలక్ష్మీపురం మండలం దిగువమండ, కురుపాం మండలం నీలకంఠాపురం గ్రామాలకు చెందిన కేసులను విచారణ చేశారు. ప్రభుత్వ నిబంధనలను ప్రతిఒక్కరు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిషేధించాలి

పాలకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీలో పర్యావరణ పరిరక్షణకు శతశాతం ప్లాస్టిక్ నిషేధం అమలుకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కమిషనర్ సర్వేశ్వరరావు కోరారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్, కిరణా షాపుల్లో ఆయన శనివారం తనిఖీలు చేపట్టారు. సుమారు 30 షాపుల్లో ప్లాసిక్ వినియోగించడంతో అపరాధ రుసుం విధించారు. ప్లాస్టిక్ వినియోగించినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

## పట్టణంలో సీపీఎం మహాసభ

బెలగాం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి మోదీ అవలంబిస్తున్న విధానాలు ప్రజాస్వామ్యానికి పెనుముప్పుగా ఉన్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో పార్వతీపురం పట్టణ ఆరవ మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ అమలు చేయాలని చూస్తున్న జమిలీ ఎన్నికలతో ప్రశ్నించే హక్కు కోల్పోతామన్నారు. అనంతరం జెండాను ఆవిష్కరించి పలువురు నాయకులకు నివాళి అర్పించారు. అనంతరం పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.